# మేరేజ్ డే

-గురుజాడ
శోభా పేరిందేవి



ముసుగు తన్ని పడుకున్న చక్రపాణి, భార్య లక్ష్మి పిల్లలని గట్టిగా తిట్టడంతో, ఉలిక్కిపడి లేచాడు. బాగా ఎండెక్కిపోవడం చూపి, 'అరెరె! ఆఫీసుకు పైమయి పోతోంది' అనుకుంటూ మంచం మీదనుంచి క్రిందకి ఉరికాడు. హడావిడిగా ఆ గదిలో

నించి బయటకు రాబోతున్న అతను యధాలాపంగా కేలండరు వైపు చూసినవాడల్లా చటుక్కున ఆగిపోయాడు.

'అరె! ఈ రోజు మే నెల పందొమ్మిదవ తారీఖు. ఈ రోజుకి తమ పెళ్ళయి పది సంవత్సరాలు పూర్తయ్యాయి. ప్రతి రోజులా కాకుండా—ఈ ఒక్క రోజైనా తామిద్దరూ కీచులాడు కోకుండా సంతోషంగా గడపాలి' అని తీర్మానించుకున్నాడు.

గబగబా బాత్‌రూమ్‌లోకి నడిచి మొఖం కడుక్కున్నాడు. అక్కడి నించే, "కాఫీ!" అని రాగయుక్తంగా అరిచాడు. పెళ్ళయిన క్రొత్తల్లో ఇలాగే అతను 'కాఫీ' అని పాట పాడడం, 'రెడీ సార్! అక్కడికే తెమ్మంటారా?' అని లక్ష్మి కొంటెగా అడగడం అతనికి గుర్తొచ్చి, ఆ విధంగా 'కాఫీ' అని అరిచేలా చేసాయి.

వంటగదిలో పనిలో ఉక్కిరిబిక్కిరవుతున్న లక్ష్మి అతని అరుపు వింటూనే గయ్యిమని లేచింది.

"కాఫీట కాఫీ! శుభ్రంగా ఈ వేళకి రాజాలాగా లేచింది కాక ఆర్డర్లు కూడా ఇస్తున్నారే! చెయ్యి ఖాళీగా లేదూ, పని పూర్తయ్యాక ఇస్తాను" అంది దురుసుగా.

ఆ ఒక్క మాటతోనే చక్రపాణి నీరు కారిపోయాడు. ఈసురోమంటూ ముందర గదిలోకి వచ్చి కూర్చుని, దినపత్రికని అందుకున్నాడు. పది నిముషాలయ్యాక కాఫీ తీసుకుని వచ్చింది లక్ష్మి. కాఫీ గ్లాసుని అతని ప్రక్కన గట్టిగా చప్పుడు చేస్తూ పెట్టి వంటింట్లోకి పోబోతున్న లక్ష్మి, "ఇదిగో! మీ కాఫీ అక్కడ పెట్టాను. పంచదార అయిపోయింది కాబట్టి బెల్లం వేసాను. ఇవాళ సాయంత్రం ఆఫీసునుండి వచ్చేటప్పుడు పంచదారతో పాటు మరి కొన్ని వస్తువుల లిస్టు ఇస్తాను—తీసుకురండి. ఇంకొక విషయమేమిటంటే కిరాణా కొట్టువాడు, 'డబ్బు ఇస్తేగాని ఇక వస్తువులు ఇవ్వను. ఇప్పటికే రెండు నెలల నుండి డబ్బులివ్వలేదు' అన్నాడు. ఏం చేస్తారో ఇక మీ ఇష్టం. బియ్యం కూడా నాలుగు రోజులకి సరిపడా ఉన్నాయి" అని వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా తన మీద పిడుగుల వర్షం కురిసినట్టు ఫీలయిన పాణి, ఇక అక్కడ ఉండలేనట్లుగా కాఫీని తాగాననిపించి, బాత్రూమ్‌లోకి దూరి తలుపేసుకున్నాడు.

విసురుగా చెంబుతో బక్కెట్‌లోని నీళ్ళు ఒంటిమీద పోసుకుంటున్న చక్రపాణికి తన స్థితిని చూస్తే అసహ్యం వేసింది.

నిద్రలేచినది మొదలు పడుకునే దాకా మధ్యతరగతి మనిషి డబ్బు సమస్యకి తట్టుకోక తప్పడం లేదు. 'తానిప్పుడు ఏం చెయ్యాలి? అప్పు చెయ్యడం తప్ప మార్గం లేదు. ఇప్పుడు తనకి అప్పు ఇవ్వడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?' ఆలోచనలు పాణిని చుట్టెయ్యసాగాయి.

స్నానం చేసి బైటకి వచ్చిన పాణి, ఇక ఆఫీసుకు వెళ్ళేదాకా భార్యతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పిల్లలు, భర్త-స్కూళ్ళకి, ఆఫీసుకి వెళ్ళిపోవడంతో తలుపు వేసుకుని, వాళ్ళు ఎక్కడివక్కడ పడేసిన వస్తువులని సర్దసాగింది. 'అసలే ఉన్నవి రెండే రెండు ఇరుకు గదులు. అవి కూడా శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా?' అనుకుంటూ కేలండరు వైపు చూసి ఉలిక్కి పడింది.

'పందొమ్మిదవ తారీఖుకే సరుకులన్నీ నిండుకుంటున్నాయి. ఇక ఇరవై తొమ్మిదికో?' అనుకుంటున్న లక్ష్మికి హఠాత్తుగా ఇవాళ తమ పెళ్ళి రోజన్న సంగతి జ్ఞాపకం వచ్చింది.

'ఛీ-ఛీ! ఈ రోజు కూడా తను ఆయనను ప్రొద్దుటినుంచీ సాధిస్తూనే ఉంది. ఆయన మాత్రం ఏం చేస్తారు—ధరలు ఆకాశంలోకి పోతున్నా జీతం ఏమాత్రం పెరగకపోతే? కనీసం సాయంత్రం ఆయన వచ్చాకయినా తను సరదాగా మాట్లాడాలి' అనుకుంది.

స్నానం, భోజనం పూర్తిచేసి ప్రక్కింటి నుంచి తెచ్చుకున్న సినిమా పత్రికను చేతుల్లోకి తీసుకుంది లక్ష్మి. సినిమాలు అయస్కాంతాల్లాంటివి. ఇట్టే మనుష్యులను తమ వైపు లాక్కుంటాయి. ఆ పత్రికను చదువుతూ నడుం వాల్చిన లక్ష్మి ఎప్పటికో నిద్రలోకి జారుకుంది.

* * *

సాయంత్రం ఆఫీసు నుండి వచ్చి అలసటగా కుర్చీలో కూలబడిన పాణిని చూస్తే లక్ష్మికి జాలి వేసింది. 'పాపం! ఎంత అలసిపోయారో?' అనుకుంటూ అతనికి కాఫీ కలపడానికి వంటింట్లోకి నడిచింది. ఆ క్షణంలో ఆమెకి ప్రొద్దున్న అతనికి తను చెప్పిన లిస్టు విషయమే గుర్తుకు రాలేదు.

కాఫీతోబాటే పకోడీల ప్లేటు అతనికి అందించిన లక్ష్మి, "ఇదే

ఇవాళ్టి మన మేరేజ్‌డే స్పెషల్" అంది పేలవంగా నవ్వుతూ. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగసాగాయి.

"పోనీలే. ఇవాళ కాఫీతోబాటు టిఫిన్ కూడా ఉందిగా- అదే మరి స్పెషాలిటీ. నువ్వు కూడా రా నాతోపాటు తిందువుగాని. పిల్లలేరి?" అడిగాడు పాణి.

"బయట ఆడుకుంటున్నారు" చెప్పింది లక్ష్మి.

"లక్ష్మీ! ఇవాళ మనం సినిమాకు వెడుతున్నాం" అన్నాడు సూటిగా లక్ష్మి కళ్ళల్లోకి చూస్తూ. ఉదాసీనంగా ఉన్న లక్ష్మి కళ్ళు ఉల్కల్లా మెరిశాయి. 'నిజంగానా?' అనబోయి "ఎలాగండీ?" అని అడిగింది.

"అప్పు చేసి డబ్బు తెచ్చాను. నువ్వు చెప్పిన వస్తువుల కోసం కొట్లోకి వెళ్ళబోయిన వాడిని ఆగిపోయాను. నేను తెచ్చిన డబ్బు కేవలం పది రూపాయలు. ఇంతకన్నా ఎక్కువ అప్పు పుట్టలేదు. ఈ పది రూపాయలని నాకెందుకో నువ్వు చెప్పిన వస్తువుల కోసం ఖర్చు పెట్ట బుద్ధి కాలేదు. యాంత్రికంగా సాగిపోతున్న మన జీవితాలకి ఏదో ఒక కొత్తదనం కనీసం ఈ ఒక్క రోజుకైనా వచ్చి తీరాలనిపించింది. ఖర్చులు, డబ్బు సమస్యలు రోజూ ఉండేవే. కానీ ఆనందంగా గడిచిన క్షణాలు ఈ మధ్య మన జీవితాలలో పూర్తిగా కరువై పోయాయి. అందుకే చెప్తున్నాను- త్వరగా పిల్లల్ని తయారుచేసి నువ్వుకూడా తయారవ్వు. నాకూ అప్పు పుట్టింది 10 రూపాయలే అని కానీ, ఆ పది రూపాయలని ఈ విధంగా ఖర్చు పెడుతున్నానే అని కానీ ఆలోచించకు" అన్నాడు పాణి.

సినిమా థియేటరు చేరుకునే దాకా వాళ్ళు ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. సినిమా హాలులో భర్తని ఆనుకుని కూర్చున్న లక్ష్మికి తృప్తితో కడుపు నిండినట్లనిపించింది. ఇద్దరు పిల్లలతో నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెప్తూ తాత్కాలికంగా పిల్లల్లా మారి పోయారు వాళ్ళిద్దరూ.

సినిమా పూర్తయినా కూడా వారి ఉత్సాహం అలాగే ఉండిపోయింది. చూసిన సినిమా గురించి కబుర్లు చెప్పుకుంటూ ఇల్లు చేరారు.

బట్టలు మార్చుకుని అన్నం వడ్డించింది లక్ష్మి. అన్నాన్ని చూడగానే బియ్యం అయిపోవస్తున్నాయని గుర్తొచ్చింది లక్ష్మికి. ఆమెను చూడగానే పాణికి కూడా అన్నీ

గుర్తు వచ్చాయి. కానీ ఎవరూ ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా భోజనం చేసారు. తల్లి పక్క వేసి వేయడంతోటే నిద్రలోకి జారుకున్నారు పిల్లలు.

మంచం మీద భర్త ప్రక్కగా పడుకొని కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తోంది లక్ష్మి. బయటంతా చీకటిగా ఉంది- మధ్య తరగతి బ్రతుకుల్లాగే. కానీ ఒక్కటే తేడా. ఇప్పటి ఈ చీకటి రేపు తెల్లవారగానే మటు మాయమయి పోయి వెలుతురు వస్తుంది. కానీ తమ బ్రతుకులు మాత్రం ఎన్ని పగళ్ళు, ఎన్ని రాత్రులు గడిచినా ఇలాగే ఉండిపోతాయి.

"లక్ష్మీ! సినిమా చాలా బావుంది కదూ?" అడిగాడు పాణి.

"సినిమా బావుంది. కానీ మన మధ్యతరగతి బ్రతుకులే బావు లేవండీ!" అంది నెమ్మదిగా.

"ప్లీజ్ లక్ష్మీ! నువ్వు ఈ ఒక్క రోజుకీ ఆ రకమైన ఆలోచనలకి స్వస్తి చెప్పు. రేపటి సంగతి రేపు చూసుకుందాం. అది సరే కానీ మన పెళ్ళి రోజు గుర్తుందా? మా అమ్మ, చెల్లి మీ వాళ్ళని ఎంతగా ఆట పట్టించారో? చెల్లి అయితే మరీనూ. ఆడపడును నంటూ ఒకటే అల్లరి" అన్నాడు.

"గుర్తులేకేం లెండి! మావాళ్ళు మాత్రం తక్కువ తిన్నారా? మా చిన్న చెల్లెలు 'బావాబావా పన్నీరు' అని మిమ్మల్ని ఏం ఏడిపించిందో! కానీ నా ఒక్కదాని పెళ్ళికే ఉన్న కాస్త పొలం అమ్మిన మా నాన్న మాత్రం ఆ ఉత్సాహంలో అంత పాలు పంచుకోలేక పోయాడు" అంది లక్ష్మి ఏదో ఆలోచిస్తూ యధాలాపంగా.

"మరే అంత కట్నం పోసి నన్ను పెళ్ళి చేసుకున్న నువ్వు ఏం సుఖపడుతున్నావు కనుక? అవును మరి! పెళ్ళి రోజున పెళ్ళాన్ని అప్పు చేసి తెచ్చిన డబ్బుతో సినిమాకి తీసుకు వెళ్ళిన నీ భర్తలాంటి వాడు పగవాళ్ళకి కూడా వద్దు" అన్నాడు పాణి.

"అవును లెండి! నే నేమీ అనకుండానే మీరు ఈ మాటలు అంటున్నారంటే మీలో ఉన్న గిల్టీనెస్ కనిపిస్తోంది" అంది లక్ష్మి.

పాణి అగ్నిని చేస్తే అందులో ఆజ్యం పోసింది లక్ష్మి. ఇద్దరి గొంతులూ హెచ్చాయి. పిల్లలు లేచారు. పాణి చెయ్యి పైకి లేచింది. లక్ష్మి కళ్ళు చెరువు లయ్యాయి. లక్ష్మి వంటింట్లోకి వెళ్ళి తలుపులు భళ్ళున మూసు

కుంది.

'నన్నింతలేసి మాటలనడానికి ఎంత ధైర్యం?' అనుకుంటున్నాడు పాణి ముందు గదిలోంచి. 'రేపు ఇంటిక్కావలసిన వస్తువులు తెచ్చినప్పుడు చూద్దాం' అనుకుంటోంది లక్ష్మి కసిగా.

పెళ్ళిరోజు చిరాకుతో మొదలయినట్లుగానే చిరాకుతో ముగిసింది.

నిజానికి లోపం వారిద్దరిలోనూ లేదు. వారి దగ్గర లేని డబ్బు వారిని ఆ విధంగా ఆడిస్తోంది. వారు ఈ ఒక్కరోజుకీ డబ్బు సంగతి మరచిపోదామని ప్రయత్నించినా కృతకృత్యులు కాలేక పోయారు. అది వాళ్ళ బలహీనత. ఈ బలహీనత వారిద్దరిలో మాత్రమే లేదు. ఎన్నో మధ్య తరగతి కుటుంబాలు వారు, కనీసం ఒక్కరోజైనా సుఖ సంతోషాలతో ఉండాలన్నా ఉండలేక పోతున్నారనడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే!

*

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా :

ఎడిటర్,

**'విజయ'**

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.